820) పాడి

ప॥ వేరొక్కరూ లేరు విశ్వమింతా నీమహిమ। యేరీతి నీవే కలవు యితరము లేదు॥

చ॥ తల్లివై రక్షింతువు తండ్రివై పోషింతువు। యిల్లాలివై మోహమిత్తువు నాకు।
వొళ్ళై పెరుగుదువు వోగి బురాకృత మౌదు। యిల్లు ముంగిలై వుందువింతా నీ మహిమే॥

చ॥ గురుడవై బోధింతువు కొడుకవై యీడేర్తువు। అరుదై నిధానమవౌదు నీవే।
దొరవై నన్నేలుదువు దూతవై పని సేతువు। యిరవైన సిరులిత్తు వింతా నీ మహిమే॥

చ॥ దేవుడవై పూజ గొందు దిక్కుప్రాణ మౌదువు। కావలసిన ట్టౌదు కామించినటు।
శ్రీవేంకటేశ నీవే నాచిత్తములోపల నుండి। యావల వైకుంఠమిత్తు వింతా నీ మహిమే॥